Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 226 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :226 | బుధవారం 13 ఆగస్టు 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774

# ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలి

- ఉచిత ప్రయాణం.. మహిళలకు మర్యాద ఇవ్వాలి సుమా!
- ఆటో డ్రైవర్లకు సాయంపైనా సమగ్ర అధ్యయనం చేయాలి
- అధికారుల సమీక్షలో సీఎం చంద్రబాబు




**అమరావతి**

రాష్ట్రంలోని మహిళలు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్ట్ 15 నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం 'స్త్రీశక్తి' సన్నద్ధతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సమీక్షలో సీఎం అధికారులను ఆదేశించారు. అధిక రద్దీకి అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నిర్వహణ సమర్థంగా చేయాలని, అందుకు తగ్గట్టు సామర్థ్యం పెంచుకోవాలని, భద్రత కూడా ముఖ్యమని - మిగతా3లో



## 'గణాంకాలతో సిద్ధంగా ఉండండి'

- ఎన్నికల సంఘానికి సుప్రీం సూచన
- బిహార్ ఎస్ఐఆర్‌లో సామూహికంగా ఓటర్లను తొలగిస్తే తక్షణమే జోక్యం చేసుకుంటామని జులై 29న సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్న విషయం తెలిసిందే.
- బిహార్‌లో ఎస్ఐఆర్‌ను నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై స్టే విధించేందుకు నిరాకరించింది.
- అదేవిధంగా ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతో పాటు స్వయంగా ఓటర్ ఐడీ కార్డును పరిగణనలోకి తీసుకోవాలి



## చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాడు

- "పోలీసుల సహాయంతో మా పోలింగ్ ఏజెంట్లను బయటికి నెట్టేశారు
- ఇతర నియోజకవర్గాల నుంచి వందలాది మంది టీడీపీ గూండాలు వచ్చారు
- వైఎస్సార్‌సీపీ నేత బలరాంరెడ్డి పోలింగ్ ఏజెంట్‌గా ఉన్నప్పటికీ ఆయన్ని వెళ్లనివ్వలేదు
- వైఎస్సార్‌సీపీకి ఓటు వేసే వారిని గుర్తించి బయటికి పంపించేస్తున్నారు
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి



## అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగింపు

- వాణిజ్యం, పెట్టుబడులను పెంచడమే లక్ష్యంగా వాషింగ్టన్‌తో సంప్రదింపులు జరుపుతున్నాం
- భారత్ నుంచి ఎగుమతి అయ్యే కొన్ని వస్తువులపై అమెరికా ఆగస్టు 7 నుంచి 25 శాతం సుంకం విధించింది
- దీనివల్ల అమెరికాకు జరిగే మొత్తం భారత ఎగుమతుల్లో దాదాపు 55 శాతం విలువపై ప్రభావం పడుతుందని అంచనా

## ఎన్నికల సంఘం తనపని తాను సరిగా చేయడం లేదు



- ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ
- దుష్టశక్తుల బారినుంచి తాము రాజ్యాంగాన్ని కాపాడుతూ వస్తున్నామని,
- కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం తీరు భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా ఉంది
- ఈసీ తీరుతో రాజ్యాంగానికి విఘాతమని, తాము రాజ్యాంగాన్ని కాపాడుతూ వస్తున్నాం

## నామినేటెడ్ పదవుల జాతర



- 31 నామినేటెడ్ పోస్టుల భర్తీ
- తీవ్ర కసరత్తు అనంతరం జాబితా విడుదల
- బీజేపీ, జనసేన పార్టీలకూ అవకాశం

**అమరావతి**

రాష్ట్రంలో మరికొన్ని నామినేటెడ్ పోస్టులను మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. తాజాగా 31 పదవుల భర్తీకి సంబంధించిన జాబితా విడుదలైంది. తాజాగా భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల వివరాలిలా.. రాష్ట్ర షెడ్యూల్డ్ కాస్ట్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ – ఆకేపోగు ప్రభాకర్ (కొడుమూరు–ఎస్సీ) (తెదేపా), సామాజిక సంక్షేమ బోర్డు– బాల కోటయ్య (నందిగామ–ఎస్సీ)– (బహుజన జేఏసీ), కమ్మ కార్పొరేషన్– బ్రహ్మం చౌదరి, గురజాల (తెదేపా), బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్– బుచ్చి రాంప్రసాద్, గుంటూరు వెస్ట్ (తెదేపా), ముదలియార్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ – సి.ఎస్. త్యాగరాజన్– చిత్తూరు (తెదేపా), బొందిలి - మిగతా3లో



## ఏపీ సచివాలయంలో ప్లాస్టిక్ నిషేధం

- ఆగష్టు 15 నుండి అమలుకు చర్యలు
- విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి మరీ ముఖ్యంగా మానవాళికి కలుగుతున్న నష్టం వర్ణణాతీతం
- ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు
- అన్ని శాఖల కార్యదర్శులతో సీఎస్ విజయానంద్ సమీక్ష

## ఆధార్ అప్‌డేట్ ఉంటేనే.. ఫ్రీ జర్నీ!!

- "అమ్మా.. ఆధార్ కార్డ్ అప్‌డేట్ ఉండాలె. లేకుంటే పైసలిచ్చి టికెట్ తీసుకోండి.."
- తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్న మాట
- "ఇయ్యాల్టికి వదిలేస్తున్నాం.. రేపటికల్లా అప్‌డేట్ చేసుకోండ్రి..
- లేకుంటే మాత్రం ఊకోం." ఇది మరికొందరు కండకర్లు చెబుతున్న మాట.
- ఆధార్ కార్డులో ఆంధ్రప్రదేశ్ అని ఉండడమే అందుకు ప్రధాన అభ్యంతరం



**హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు ఆధార్ అప్‌డేట్ ఉంటేనే ఆ ప్రయాణం వర్తిస్తుందని పలువురు కండక్టర్లు తెగేసి చెబుతున్నారు. ఆధార్ కార్డులో ఆంధ్రప్రదేశ్ అని ఉండడమే అందుకు ప్రధాన అభ్యంతరంగా చెబుతున్నారు. మన దేశంలో ఆధార్ కార్డులు జారీ అయ్యాక ఇప్పటిదాకా ఎలాంటి అప్‌డేట్ చేసుకోని వాళ్లు కోట్లలోనే ఉన్నారు. అదే టైంలో.. కేవలం పేర్లు, డేట్ ఆఫ్ బర్త్ మాత్రమే మార్చేసుకున్నవాళ్లు ఉన్నారు. ఈ క్రమంలో తెలంగాణ ఉమ్మడి జిల్లాల పేరుమీదే.. ఏపీ రాష్ట్రం అలాగే ఉండిపోతూ వచ్చింది. అయితే తెలంగాణలో ఫ్రీ జర్నీ అమలై ఏడాదిన్నర పైనే అవుతోంది. ఈ క్రమంలో ఆధార్ అప్‌డేట్ - మిగతా3లో



## సీబీఐకి వామనరావు హత్య కేసు

- లాయర్ గట్టు వామనరావు దంపతుల కేసును సిబిఐ కి బదిలీ చేస్తూ ఆదేశాలు
- తన కొడుకు, కోడళ్ళ హత్య కేసును సిబిఐకి బదిలీ చేయాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు గట్టు కిషన్ రావు.
- లాయర్ దంపతుల హత్య కేసును తిరిగి విచారణ జరపాలి
- పిటిషనర్ గట్టు కిషన్ రావుకు భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశం



## దేశంలో 6,115 స్టేషన్లలో ఉచిత వైఫై

- "దేశంలోని దాదాపు అన్ని రైల్వే స్టేషన్లలో టెలికాం సంస్థలు 4జీ/5జీ సేవలను అందిస్తున్నాయి
- ప్రయాణికులు ఈ నెట్‌వర్క్‌లను డేటా కనెక్టివిటీ కోసం ఉపయోగించుకుంటున్నారు
- దీనికి అదనంగా, ప్రయాణికుల సౌకర్యార్థం 6,115 స్టేషన్లలో ఉచిత వైఫై సౌకర్యాన్ని కూడా కల్పించాం"

## ఓవైపు యుద్ధ హెచ్చరికలు.. మరోవైపు నీటి కోసం అభ్యర్థనలు



- యుద్ధం గురించి ఆలోచించడం తప్ప మరో మార్గం లేదు
- పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌కు నిలిపివేసిన సింధూ జలాల సరఫరాను తిరిగి పునరుద్ధరించాలి
- ఈ ఒప్పందాన్ని నమ్మకంగా, న్యాయబద్ధంగా కొనసాగించాలని కోరుతున్నట్లు వెల్లడి

## కుప్పం మునిసిపాలిటీకి 500 కమర్షియల్ చెత్త కుండీలు పంపిణీ


### శుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన కుప్పం వైపు ఒక ముందడుగు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్ట్12:**
పరిశుభ్రత,సామాజిక సంక్షేమాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో, పిఇఎస్ సంస్థలు, ఛైర్మన్ ప్రొ.జవహర్ దోరస్వామి నాయక త్వంలో, కుప్పం మునిసిపాలిటీకి 500 కమర్షియల్ చెత్త బిందెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం మునిసిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్ రావు, పిఇఎస్ సంస్థల సీఓఓ ప్రొ. అజయ్ కుమార్, మరియు పిఇఎస్ మెడికల్ కాలేజ్, కుప్పం డీన్ ప్రిన్సిపల్ డా.హెచ్. ఆర్.కృష్ణారావు హాజరయ్యారు. కార్యక్రమం డా.హెచ్.ఆర్.కృష్ణారావు ఆత్మీయ స్వాగతంతో ప్రారంభమైంది. ఆయన మానవ సేవ, వైద్యసేవ, విద్యా మరియు సామాజిక సేవల పట్ల పిఇఎస్ మెడికల్ కాలేజ్ యొక్క అంకితభావాన్ని ప్రస్తావిం చారు.ప్రొ.జవహర్ దోరస్వామి తన ప్రసం గంలో పిఇఎస్ సంస్థలు సమాజ సంక్షేమం పట్ల ఎప్పటికీ కట్టుబడి ఉంటాయని పునరుద్ఘాటించారు."మా లక్ష్యం విద్యతో మాత్రమేపరిమితం కాదు. ఆరోగ్యం, విద్య, పరిశుభ్రత వంటి సమాజానికి అవసరమైన అంశాలలో సేవ చేయడం మా నిరం తర బాధ్యత"అని అన్నారు.ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పిఇఎస్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిని "కుప్పం ప్రజల జీవనా డి"గా అభివర్ణించారు. "పేదలు, గ్రామీణ ప్రజలకు తక్కువ ఖర్చుతో అధునాతన వైద్యసేవలు అందిస్తున్న ఈ ఆసుపత్రి వేలాది మందికి ప్రాణాధారంగా మారింది. ఇటువంటి సంస్థలు కేవలం సేవా సంస్థలే కాక,సమాజానికి ఆశ,పురోగతికి నిలయాలు" అని ఆయన అన్నారు. కమిషనర్ శ్రీనివాస్ రావు స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కింద, రాబోయే ఆరు నెలల్లో కుప్పం రాష్ట్రంలోనే మొదటి 100% శుభ్రమైన మునిసిపాలిటీగా అవతరించబోతుందని ప్రకటించారు. "ఇది సాధించడానికిమేము మూలంలోనే చెత్త వర్గీకరణ, ఇంటింటికీ చెత్త సేకరణ,ప్రజా అవగాహన కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యం వంటి బహు ముఖ విధానాన్ని అనుసరిస్తున్నాము. పిఇఎస్ సంస్థలు అందించిన ఈ 500 కమర్షియల్ చెత్త బిందెలను ప్రజాస్థలాల్లో వ్యూహాత్మకంగా ఉంచుతాము" అని చెప్పారు. ప్రొ.అజయ్ కుమార్ పరిశుభ్రత సాధించడంలో వ్యక్తిగత బాధ్యత ప్రాము ఖ్యతను నొక్కి చెప్పారు. "పరిశుభ్రత మన నుండి మొదలవుతుంది. మన ఇల్లు, పరిసరాలు, పని ప్రదేశం శుభ్రంగా ఉంచితే సమాజం కూడా ఆరోగ్యకరంగా, చైతన్యవంతంగా మారుతుంది. మన పట్టణాలు, గ్రామాలు మార్చాలంటే ఆ మార్పు మన ఇంటి ముందు నుండే ప్రారంభం కావాలి" అని అన్నారు. అలాగే ఈ విలువలను విద్యార్థుల్లో నాటే కర్తవ్యం విద్యాసంస్థలదని ఆయన అన్నారు.

### ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రెండు రోజుల

## నియోజక వర్గం పర్యటన ఖరారు.



**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 12:**
స్థానిక శాసన సభ్యులు పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ హిందూపురం నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటన చేయడానికి ఖరారైనట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 14న గురువారం ఉదయం 10 గంటల 30 నిమిషాలకు యం.జె.పి గురుకుల పాఠశాలలో కొత్తగా నిర్మించిన లాబ్‌లు మరియు విద్యార్థినుల వసతి గృహాల ప్రారంభోత్సవం చేస్తారు.ఉదయం 11:15 గంటలకు హిందూ పురం మండలం పూలకుంట గ్రామంలో సూర్య ఘర్ పథకం ప్రారంభోత్సవం చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు హిందూపురం ఎమ్మార్వో కార్యాలయందగ్గర ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రారంభంచేస్తారు. మధ్యాహ్నం గం. 3:30 గంటలకు ఎమ్మెల్యే నివాసంలో హిందూపురం నియోజకవర్గంలో చెరువులు నింపడానికి తీసుకోవాల్సిన చర్యలపై యచ్.యన్.యస్.యస్ అధికారులు, ఇంజనీర్లతో సమీక్షా సమావే శంలో పాల్గొంటారు. సా.4 గంటలకు సూరప్పకుంట సుందరీకరణ గురించి జిల్లా ఫారెస్ట్ అధికారులతో సమీక్ష చేయనున్నారు. సా 4:30 గంటలకు రెవిన్యూ సమస్యలపై రెవిన్యూ అధికారులతో సమీక్ష చేస్తారు. ఆగస్టు 15న శుక్రవారం ఉదయం 8:30 గంటలకు యం.జి. యం క్రీడా మైదానంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరణ చేస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల 20 నిమిషాలకు ఎపియస్ ఆర్టీసి బస్టాండ్‌లో సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభిస్తున్న స్త్రీశక్తి పథకం ప్రారంభంచేస్తారని ఆ ప్రకటనలో వెల్లడించారు.

### కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మట్

## ఆకస్మిక పరిశీలన పర్యటన



**రామకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 12:**
కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలో మంగళవారం రోజు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మట్ ఆకస్మిక పర్యటన నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, వైద్య సిబ్బంది హాజరు, పరికరాల లభ్యత, రోగులకు అందిస్తున్న సేవలపై సమీక్ష చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కి వెళ్లి సిబ్బంది హాజరు, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం, రికార్డుల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. తరువాత ఎస్.సి హాస్టల్, ట్రైబల్ హాస్టల్‌లను సందర్శించి, విద్యార్థుల వసతి, ఆహారం, సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను ఆరా తీశారు. సంబంధిత అధికారులకు అవసరమైన సవరణలు, మెరుగులు తీసుకురావాలని సూచించారు.ఈ పర్యటనలో రామకుప్పం ఎంఆర్ఓ, రామకుప్పం మండల పార్టీ అధ్యక్షులు మరియు అన్ని మండల స్థాయి ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా టిఎల్ వెంకటేష్



**పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్ట్ 12:**
అన్నమయ్యజిల్లా పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టిఎల్ వెంకటేష్‌ను జిల్లా కార్యవర్గ సభ్యుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా టిఎల్ వెంకటేష్ మాట్లా డుతూ ప్రజా సమస్యల పైన అలుపెరగని పోరాటాలు చేశానని గుర్తించిన రాష్ట్ర నాయకత్వం రెండవసారి కార్యవర్గ సభ్యుడుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు జిల్లా పార్టీకి రాష్ట్ర పార్టీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## నాయి బ్రాహ్మణులకు అండగా కూటమి ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పీఎస్ మునిరత్నం.








**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్ట్ 12:**
రాష్ట్రంలో ఉన్న నాయి బ్రాహ్మణులకు సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. మంగళవారం కుప్పం పట్టణంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం ఆధ్వర్యంలో నాయి బ్రాహ్మణులు సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. అనంతరం బస్టాండులో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట మేరకు సీఎం చంద్రబాబు నాయుడు నాయి బ్రాహ్మణులు నిర్వహించుకునే సెలూన్ షాపులకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో నాయి బ్రాహ్మణులకు ప్రతినెల దాదాపు 2000 రూపాయలు విద్యుత్ భారం తగ్గుతుందని వారు పేర్కొన్నారు. కుప్పంకు చెందిన వైద్యం శాంతారాం పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి సీఎం చంద్రబాబు నాయుడు ఆయనకు టిటిడి బోర్డు సభ్యుడిగా తగుస్థానం కల్పించారని బీసీలకు ఎన్నటికీ అండగా నిలిచేది తెలుగుదేశం పార్టీయేనని వారు పేర్కొన్నారు. నాయి బ్రాహ్మణులు కూటమిప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం చెందాలని వారు కోరారు. కార్యక్రమంలో కడాసభ్యులు రాజ్ కుమార్, డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, జనసేన నేత నరేష్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, 11వ క్లస్టర్‌కన్నన్, కన్వీనర్ ఆర్ చంద్ర శేఖర్, రామకుప్పం టిడిపి అధ్యక్షుడు ఆనంద రెడ్డి. కుప్పం నియోజకవర్గ నాయిబ్రాహ్మణ అధ్యక్షుడు జ్యోతీశ్వర్, నాలుగు మండలాల నాయి బ్రాహ్మణ అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

# చేతి వృత్తులకు చంద్రబాబు చేయూత

## కోట చంద్రశేఖర్ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి



**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్12:**
శ్రీకాళహస్తి గత వైసిపి ప్రభుత్వ నిర్వాకం కారణంగా తీవ్రమైన నిర్లక్ష్యానికి గురై, సాంప్రదాయికంగా, వంశ పారంపర్యంగా వస్తున్న కొన్ని కులవృత్తుల వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచాలన్న లక్ష్యంతో చంద్రబాబు నాయుడు చేతి వృత్తుల వారికి చేయూత అందిస్తున్నారని తెలుగుదేశం పార్టీ, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు నాయకుడు కోట చంద్రశేఖర్ పేర్కొన్నారు. చేతి వృత్తుల పై ఆధారపడి జీవించే వారు సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు అవసరమైన ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఎన్డీయే కూటమి పెద్దలు ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సియం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చిత్రపటాలకు మంగళవారం స్థానిక పూసలవీధి కూడలిలో తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నాయకులు పాలాభిషేకం చేశారు.ఆదరణ పథకం ద్వారా బీసీ సామాజికవర్గాల్లోని చేతివృత్తుల వారి ఆర్థికాభివృద్ధి కోసం యంత్రాలు, పరికరాలు ఇచ్చి గతంలో టిడిపి ప్రభుత్వం అండగా నిలిచింది అని, కానీ జగన్ నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని దుర్మార్గంగా రద్దు చేసి బిసిలకు తీరని నష్టం కలిగించింది అని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల ప్రచా ర సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం, నేడు నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్‌లకు ఉచిత విద్యుత్ ను 150 నుండి 200 యూనిట్లు అందిస్తున్నది, అలాగే ఆదరణ పథకం ద్వారా 90% సబ్సిడీతో పనిముట్లు పంపిణీ, దేవాలయాలలో పని చేసే నాయీ బ్రాహ్మణులకు 25,000 వేలకు వేతనాలు పెంపు వంటి నిర్ణయాలు నాయీ బ్రాహ్మణులకు జీవితా లకు భరోసా కల్పిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. చేతి మగ్గాలకు 200, మర మగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వ డం, 5 కోట్ల రూపాయలతో థ్రిఫ్ట్‌నిధి ఏర్పాటు, 50 సంవత్స రాలు దాటిన నేత కార్మికులకు 4000 రూపాయలు పెన్షన్ వంటి నిర్ణయాలు తీసుకున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి చేనేతలు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకున్నారు.గీత కార్మికులకు ఆర్థిక భరోసా ఇవ్వటానికి గాను మద్యం దుకాణాలలో మరియు బార్‌లలో పది శాతం కేటాయింపు చేయడం పట్ల గీత కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి వారి గురవారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నియకుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం సింగిల్ విండో ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు లక్కమనేని మధుబాబు,తదితరులు పాల్గొన్నారు.

## మహిళను బెదిరించి చైన్ లాక్కోని వెళ్లిన దుండగులు

**గంగవరం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు12:**



వివాహిత మెడలో నుంచి 32 గ్రాముల బంగారు చైన్ లాక్కెళ్ళిన దుండగుడు. సాయి ప్యాలెస్ బ్యాక్ సైడ్ నందు కాపురం ఉంటున్న శ్రావణి మెడలో నుండి 32 గ్రాములు బంగారు లాక్కెళ్ళిన దుండగుడు.. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు దుండగులు శ్రావణి అనే మహిళను ఏదో మాట్లాడే నెపంతో శ్రావణిని మీ ఆయన పేరు రామారావు అని అడిగాడు కాదండి అని చెప్పి ఇంట్లో లోపలికి వెళ్లిపోయింది.పది నిమిషాల తర్వాత ఇంటి లోపల దూరి మెడ పట్టుకొని చైన్ లాక్కుని డోర్ వేసుకుని వెళ్లి పోయాడు, దుండగుడు శ్రావణి గంగవరంపోలీసులకు ఫిర్యాదు చేసిన శ్రావణి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.

## సింగిల్ విండో డైరెక్టర్‌కు ఘన సన్మానం



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్ట్ 12:**
అన్నమయ్యజిల్లా పీలేరు సింగిల్ విండో డైరెక్టర్ అమానుల్లాకు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా హామానుల్లా మాట్లాడుతూ తమకు కల్పించిన కుమారుడికి కృతజ్ఞతలు తెలిపారు. సహకారసంఘం అభివృద్ధికి రైతుల ప్రయోజనాల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిషోర్ నాయుడు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీలేరు పంచాయతీకి హుమాయున్ సేవలు వెలకట్టలేనిది

**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్ట్12:**




అన్నమయ్యజిల్లా పీలేరు పంచాయతీకి మాజీ సర్పంచ్ హ్యూమయన్ సేవలు వెలకట్టలేని వని సర్పంచ్ హబీబ్ భాషా తెలిపారు. ఈ సందర్భంగా కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పిం చారు. పంచాయతీకి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పంచాయతీ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో లతీఫ్ ఖాన్ వార్డు సభ్యులు ఉదయ్ కాలేశా అబిద్ తదితరులు పాల్గొన్నారు

## సమస్యల పరిష్కారానికి ముందడుగు వేస్తున్న ఎంపీడీవో, ఈశ్వరన్.





**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 12:**
వీ.కోటమండలంలోని అనేక గ్రామాలలో పలు సమస్యలు తమ దృష్టికి రావడంతో మంగళ వారం రోజు... దయ్యాలపల్లి గ్రామాన్ని సందర్శించి ఆ గ్రామంలో నెలకొన్నటువంటి డ్రైనేజ్ కాలువల సమస్యను మరియు వీధి దారులను తమ పర్యవేక్షణలో స్వయాన పరిశీలించి.. స్థానిక ప్రజలను అక్కడ ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకోవడమైనది. అనంతరం దారి మరియు డ్రైనేజ్ కాలువల మరమ్మతుల గాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే పూర్తి చేయిస్తామని స్థానిక ప్రజలకు వీకోట ఎంపీడీవో ఈశ్వరన్ హామీ ఇవ్వడం అయినది. అనంతరం అదే గ్రామంలోని అంగన్వాడి సెంటర్‌ను సందర్శించి అక్కడి అంగన్వాడీ కార్యకర్త మరియు సహాయకురాల విధి నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవోతోపాటు స్థానిక ప్రజలు, సచివాలయ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## చల్లంగా దీవించు గంగమ్మ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

### అంగరంగ వైభవంగా గంగ జాతర ఏర్పాట్లు





**రేణిగుంట,చిత్తూరు ఎక్సప్రెస్, ఆగష్టు12:**
తిరుపతి జిల్లా రేణిగుంట ప్రసిద్ధిగాంచిన గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం శ్రీకాళ హస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి ఆలయం ధర్మకర్త సోలా మల్లికార్జున్ రెడ్డి,కమిటీ సభ్యులు పూజారి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జాతరకు వచ్చిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తరపున గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి ప్రత్యేక పూజలు నిర్వహిం చగా, అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. ఏడాదికి ఒకసారి ఘనంగా అంగరంగ వైభవం గా జరిగే గంగా జాతర గంగమ్మ దర్శనాన్ని చేసుకుని, రాష్ట్రాన్ని గంగమ్మ చల్లంగా చూడాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధిపనులు అన్నీ సకాలంలో పూర్తి అయ్యేలా, ప్రజలకు అభివృద్ధి ఫలాలు లభించేలా కరుణించాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు, ఆలయానికి ఎలాంటి అవసరాలు ఉన్న ఆలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వం తరఫున తన తరపున ఎల్లప్పుడూ సహకారం ఉంటుందని తెలిపారు. ఆలయ ధర్మకర్త కమిటీ మెంబర్లు భక్తులు టిడిపి నాయకులు కార్యకర్తలు, పలువురు నాయకులు జాతరలో పాల్గొన్నారు. గంగమ్మ దర్శనానికి ముందుగా వచ్చిన ఎమ్మెల్యేకు అధికారులు, స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# 30 ఏళ్ల తర్వాత పులివెందుల ఉపఎన్నిక

**విజయవాడ:** పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అరాచకం రాజ్యమేలుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు, ఓటర్లు బూత్‌ల వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారు. టీడీపీ, పోలీసులు కలిసి వ్యూహాత్మకంగా పద్ధతి ప్రకారం కుట్ర చేశారని అంబటి ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందుల, ఒంటిమిట్టలో టీడీపీ అరాచకాలపై ఎస్ఈసీకి వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "పోలీసుల సహాయంతో మా పోలింగ్ ఏజెంట్లను బయటికి నెట్టేశారు. ఇతర నియోజకవర్గాల నుంచి వందలాది మంది టీడీపీ గూండాలు వచ్చారు. వైఎస్సార్‌సీపీ నేత బలరాంరెడ్డి పోలింగ్ ఏజెంట్‌గా ఉన్నప్పటికీ ఆయన్ని వెళ్లనివ్వలేదు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేసే వారిని గుర్తించి బయటికి పంపించేస్తున్నారు. ఎంపీ అవినాష్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు. ఆయన ఇంటిని ధ్వంసం చేశారు. సాయంత్రం వరకూ అవినాష్ రెడ్డిని తిప్పాలనుకున్నారు. ప్రజలు తిరగబడటంతో ఎర్రగుంట్లలో వదిలిపెట్టారు ..ఎస్వీ సతీష్ రెడ్డిని ఇంటి నుంచి బయటికి రాకుండా అరెస్ట్ చేశారు. వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ అభ్యర్థిని కూడా బయటికి రానివ్వలేదు. టీడీపీ అభ్యర్థి మాత్రం అన్ని చోట్లా తిరగనిస్తున్నారు. నల్లకుంట్ల పాడులో పోలీసుల కాళ్లు పట్టుకుని మరీ ఓటర్లు వేడుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజే కుట్ర మొదలైంది. పులివెందుల, ఒంటిమిట్టలో కుట్రలతో గెలవాలని ముందే ప్లాన్ చేశారు. కుట్రలతో గెలిచి వైఎస్ జగన్ పనైపోయిందని ప్రచారం చేయాలని చూస్తున్నారు టీడీపీ ఓటర్లు మాత్రమే ఓటేసేలా ప్లాన్ చేసుకున్నారు. ఇది చాలా ప్రమాదకరం. నంద్యాలలో




కూడా చంద్రబాబు ఇలానే చేశారు. చంద్రబాబు చర్యలతో వందేళ్లు వెనక్కిపోయాం. చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాడు. ఇంత దుర్మార్గంగా ఎన్నడూ ఎన్నికలు జరగలేదు. కనంపల్లిలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌ను తుపాకీతో బెదిరించారు. జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ టీడీపీ నేత నాగేశ్వరరెడ్డి పులివెందులలో ఓట్లు వేశారు. ఎన్నికల కమిషన్ తీరు చెవిటోడి ముందు శంఖం ఊదినట్లు ఉంది. ఎన్నికల కమిషన్, టీడీపీ, పోలీసులు ఒక్కటైపోతే ఎన్నికలు ఏం జరుగుతాయి? బ్యాలట్ ఓటింగ్‌లోనే ఇంత అరాచకం చేస్తే.. ఇక ఈవీఎంలు అయితే మరింత దారుణంగా వ్యవహ రించేవారు. పులివెందులలో గెలిచానని చెప్పుకోవడానికి చం ద్రబాబు ఇలా చేస్తున్నాడు. పులివెందుల వైఎస్సార్‌సీపీ జడ్పీ టిసి అభ్యర్థి గన్‌మెన్‌ను రాత్రికి రాత్రి మార్చేశారు. రాబోయే కాలంలో ప్రతిఫలం చంద్రబాబు అనుభవించక తప్పదు. చంద్రబాబు నీచమైన వ్యక్తి అని ఈ ఎన్నికల ద్వారా తేలిపోయింది.

**ఇంతకంటే దుర్మార్గం ఏముంది?: వెలంపల్లి శ్రీనివాస్**

పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో దారుణంగా వ్యవహరించారు. తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు పోలీసుల కాళ్లు పట్టుకునేలా చేశారు. ఇంతకంటే దుర్మార్గం ఏముంది?. చంద్రబాబుకి శునకానంద తప్ప ఏమీ ఒరగదు. ఎప్పుడు ఎన్నిక వచ్చినా కూటమి పార్టీలకు డిపాజిట్లు గల్లంతవ్వడం ఖాయం. ఏం సాధించావని ఎన్నికల్లో ఇలా వ్యవహరిస్తున్నారు.


**దొంగ ఓట్లు వేయడానికి టీడీపీ నేతలు క్యూ కట్టారు: మల్లాది విష్ణు**

ఎన్నికల కమిషన్ నియమనిబంధనల ప్రకారం నడుచుకోవడం లేదు. పులివెందుల, ఒంటిమిట్టలో రెవిన్యూ, పోలీసులను ఇష్టానుసారంగా వాడుకున్నారు. ఓటర్లను గ్రామ పొలిమేర్లలోనే అడ్డుకుంటున్నారు. రాష్ట్ర మంత్రులకు పులివెందుల, ఒంటిమిట్టలో ఏం పని?. దొంగ ఓట్లు వేయడానికి టీడీపీ నేతలు క్యూ కట్టారు. ఇది అసలు ఎన్నికే కాదు. ఈ ఎన్నికను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఓటమి భయంతో కుట్రపూరితంగా చంద్రబాబు వ్యవహరించారు. ఎలాగైనా పులివెందులలో గెలవాలని చంద్రబాబు తాపత్రయపడుతున్నారు. ఈ ఎన్నిక ప్రజాస్వామ్య బద్ధంగా జరగలేదు

# నామినేటెడ్ పదవుల జాతర

-మొదటిపేజీ తరువాయి

సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్- డి.విక్రమ్ సింగ్, కర్నూలు (తెదేపా), హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్- దాసరి శ్రీనివాసులు, తిరుపతి (భాజపా), వడ్డే అభివృద్ధి కార్పొరేషన్- గుంటసల వెంకట లక్ష్మి, దెందులూరు (జనసేన),
ఆరెకటిక / కటిక / ఆరే- సూర్యవంశీ సంక్షేమ, అభివృద్ధి సంఘం- హరికృష్ణారావు హనుమంతకరి, తాడిపత్రి (తెదేపా), విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ - కమ్మరి పార్వతి- పాణ్యం(తెదేపా), కుంచిటి వక్కలిగ, వక్కలిగర, కుంచిటిగ సంక్షేమ- అభివృద్ధి సంఘం- లక్ష్మీనారాయణ, మడకశిర (ఎస్సీ) (తెదేపా). నగరాలు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ - మరుపిల్ల తిరుమలేశ్వరరావు, విజయవాడ వెస్ట్ (తెదేపా), పాల-ఏకరి, ఏకిల, వ్యాకుల, ఏకిరి, నాయనివారు, పాలెగారు, తోలగారి, కవలి సంక్షేమ, అభివృద్ధి సంఘం-నాగేశ్వర నాయుడు కందూరి, రాయచోటి (తెదేపా), నూర్‌బాషా/ దూదేకుల కార్పొరేషన్- నాగుల్ మీరా కాసునూరి, విజయవాడ వెస్ట్ (తెదేపా), కురాకుల, పొందర సంక్షేమ, అభివృద్ధి సంఘం-నరసింహులు దామోదర, నరసన్నపేట (తెదేపా), వికలాంగులు, వృద్ధ పౌరుల సహాయ కార్పొరేషన్- నారాయణ స్వామి, రాప్తాడు (తెదేపా), కనీస



వేతన సలహా బోర్డు- పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, కోవూరు (తెదేపా), మాంసం అభివృద్ధి కార్పొరేషన్- ప్రకాశ్ నాయుడు, -తెదేపా, తెలుగు, సంస్కృత అకాడమీ- ఆర్.డి.విల్సన్- నెల్లూరు సిటీ (భాజపా), సగర /ఉప్పర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్- ఆర్.వెంకట రమణప్ప, పెనుకొండ (తెదేపా), నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్- రామనారాయణ రావు ఎరుబోతు, విజయవాడ సెంట్రల్ (తెదేపా), కళింగ కోమటి/ కళింగ వైశ్య సంక్షేమ, అభివృద్ధి సంఘం- రమేష్ మొదలవలస, ఆమదాలవలస (తెదేపా), సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ-రవి మందలపు, రాజమహేంద్ర వరం సిటీ (తెదేపా), వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక కార్పొరేషన్- రెడ్డి అనంత కుమారి, కొత్తపేట (తెదేపా). బెస్త సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్- శ్రీధర్ బొమ్మన, సూళ్లూరుపేట (ఎస్సీ) (తెదేపా), ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ- షేక్ రియాజ్, ఒంగోలు(జనసేన), జానపద కళలు%ం%సృజనాత్మకత అకాడమీ- వంపూరు గంగులయ్య, పాడేరు-ఎస్టీ (జనసేన), వీరశైవ లింగాయత, లింగబలిజ సంక్షేమ అభివృద్ధి సంఘం-స్వప్న, అనంతపురం అర్బన్ (తెదేపా). కృష్ణబలిజ /పూసల సహకార ఆర్థిక కార్పొరేషన్ లిమిటెడ్- త్రిమూర్తులు గంటా, భీమవరం (తెదేపా), జంగం సంక్షేమ, అభివృద్ధి సంఘం- వి.చంద్రశేఖర్, పీలేరు(తెదేపా), దాసరి సంక్షేమ, అభివృద్ధి సంఘం- వెంకట రత్నాజీ పొట్నూరు- శృంగవరపుకోట (తెదేపా).

# 225 చుట్టూ రాజకీయం

**విజయవాడ :** రాష్ట్రంలో రాజకీయాలు కీలక మలుపులు తిరుగుతున్నాయి. కూటమి దూకుడు మీద ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం దిశగా ప్రణాళికలు వేస్తోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. ముఖ్యంగా వైసీపీ హయాంలో భారీ ఎత్తున అవినీతి, కుంభకోణాలు జరిగాయని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇంకోవైపు అవన్నీ రాజకీయ కక్షపూరిత కేసులని వైసీపీ చెప్పుకొస్తోంది. అయితే లోలోపల మాత్రం ఎవరికీ వారే పట్టుబిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. 2029 ఎన్నికలను టార్గెట్ చేసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డికి అవకాశం ఇవ్వకూడదని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ బలంగా నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని చెబుతూ ప్రజల్లోకి వెళ్లేందుకు జగన్ నిర్ణయించుకున్నారు. దీంతో ఏపీలో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. ఎత్తుకు పైఎత్తులు కొనసాగుతున్నాయి.అయితే వచ్చే ఎన్నికల నాటికి ఏపీవ్యాప్తంగా నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుందని అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. నియోజకవర్గాల పెంపు విషయాన్ని ప్రస్తావించారు. ఏపీలో మరో 50 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయని అంచనా వేశారు. తద్వారా అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 225 కు చేరుకొనుంది. అయితే నియోజకవర్గాల పెంపును దృష్టిలో పెట్టుకొని ప్రధాన రాజకీయ పార్టీలు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళుతున్నాయి. ఈ విషయంలో ఎవరి అంచనాలు వారికి ఉన్నాయి. అయితే నియోజకవర్గాల విభజనతో పాటు పెంపునకు సంబంధించి అధికార కూటమి మాట చెల్లుబాటు అయ్యే అవకాశం ఉంది. వారికి అనుకూలంగా నియోజకవర్గాల పునర్విభజన ఉండే అవకాశం ఉంటుంది. చివరిసారిగా 2009లో నియోజకవర్గాల పునర్విభజన సమయంలో అప్పటి కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా జరిగింది. ఇప్పుడు కూడా టిడిపి కూటమికి లాభం చేకూరే అవకాశం ఉంది.ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ బలమైన స్థితిలో ఉంది. 135 అసెంబ్లీ సీట్లలో ఆ పార్టీ విజయం సాధించింది. అయితే ఇంకా భవిష్యత్తు వ్యూహరచన లో భాగంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను భారీగా ఆకర్షించగలిగింది. కేవలం నియోజకవర్గాల పునర్విభజన దృష్టిలో పెట్టుకొని వైసీపీలో ఉన్న బలమైన నేతలను టిడిపిలోకి రప్పించింది. అనివార్య



కారణాలతో సిట్టింగ్ ఎమ్మె ల్యేలను మారిస్తే ప్రత్యామ్నాయంగా కొంతమంది నేతలను సిద్ధం చేసుకుంది. నియోజకవర్గాల పెంపుతో లభించే స్థానాలకు ముందస్తుగానే నేతలను సంసిద్ధులను చేసింది తెలుగుదేశం పార్టీ. ఒకటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయడం.. రెండు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వైసీపీ నేతలను ఆకర్షించడం.. ఇలా ద్విముఖ వ్యూహంలో తెలుగు దేశం పార్టీ ఉంది.జనసేనకు సంబంధించి నియోజకవర్గాల పెంపు పై కూడా దృష్టి పెట్టింది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. మొన్నటి ఎన్నికల్లో సూపర్ విక్టరీ కొట్టింది జనసేన. 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి శతశాతం విజయం సాధించింది. వచ్చే ఎన్నికల నాటికి మరిన్ని సీట్లు పొందాలని చూస్తోంది. నియోజకవర్గాల పెంపులో భాగంగా.. పెరిగిన సీట్లలో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలన్న ఆలోచనలో ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో పార్టీని విస్తరించాలని చూస్తోంది. అందుకే బలమైన నేతలను ముందుగా పార్టీలోకి రప్పించింది. నియోజకవర్గాల పెంపు పై ఒక అంచనాకు వస్తే మరింత మంది నేతలను పార్టీలోకి రప్పించేందుకు వ్యూహరచన చేస్తోంది. ముఖ్యంగా ఈసారి జనసేన రాయలసీమ జిల్లాలపై దృష్టి పెట్టే ఛాన్స్ కనిపిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి భిన్నంగా ఆలోచన చేస్తున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో ప్రజలు తమ వైపు చూస్తారని అంచనా వేస్తున్నారు. ఒకేసారి 50 నియోజకవర్గాల పెంపుతో తమకు కలిసి వస్తుందని ధీమాతో ఉన్నారు. పొత్తులో భాగంగా చాలామంది నేతలకు సీట్లు దక్కవని.. అటువంటి వారంతా వైసిపి వైపు చూడడం ఖాయమని భావిస్తున్నారు. ఇలా నియోజకవర్గాల పెంపు పై అన్ని పార్టీలు ఆశలు పెట్టుకున్నాయి. అయితే అసలు నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందా? నియోజకవర్గాల పెంపు ఉంటుందా? అన్నదానిపై స్పష్టత లేదు.

# ఆధార్ అప్‌డేట్ ఉంటేనే.. ఫ్రీ జర్నీ!!

-మొదటిపేజీ తరువాయి

చేసుకోకపోవడంపై కొందరు కండక్టర్లు మహిళా ప్రయాణికులపై అసహనం? వ్యక్తం చేస్తుండడం గమనార్హం. అయితే ఆధార్ అప్‌డేట్ వ్యవహారం అనుకున్నంత ఈజీగా సాగడం లేదు. ఈ తరుణంలో ఫ్రీ టికెట్ జర్నీకి ఇబ్బందులు తప్పవా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అదే సమయంలో.. ఆధార్ అప్‌డేట్ ఉంటేనే టికెట్ అనే దానికి అధికారిక ఉత్తర్వులు ఏమైనా జారీ అయ్యాయా?.. పోనీ ఉద్యోగులకు ఏమైనా ఆదేశాలిచ్చారా? అనేదానిపై తెలంగాణ ఆర్టీసీ స్పందించాల్సి ఉంది.

**సిగ్నల్ లేదు.. పైసలియ్యండి!**

తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో క్యాష్‌లెస్ పేమెంట్‌లో భాగంగా.. ఆన్‌లైన్ పేమెంట్లను క్యూఆర్ కోడ్‌తో ప్రోత్సహిస్తోంది తెలంగాణ ఆర్టీసీ. అయితే కొందరు కండక్టర్లు ఈ విషయంలో తీవ్ర అసహనం ప్రదర్శిస్తున్నారు. ప్రయాణికులు అధికంగా ఉండడమో లేదంటే ఇతర కారణాలో తెలియదుగానీ.. సిగ్నల్ లేదని, టికెట్ మిషన్ పని చేయడం లేదని.. ఏదో ఒక కారణం చెబుతూ టికెట్‌కు క్యాష్ చెల్లించాలని కోరుతున్నారు. మరీ ముఖ్యంగా హైదరాబాద్ సిటీ బస్సుల్లో ప్రయాణికులు ఈ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

# ఏపీ సచివాలయంలో ప్లాస్టిక్ నిషేధం

**అమరావతి :** వచ్చే ఏడాది జూన్ 5 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంలో భాగంగా ఈనెల 15వ తేదీన నుండి ఎపి సచివాలయంలో ' సే నో సింగిల్ యూజ్ ప్లాస్టిక్' నినాదంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి మరీ ముఖ్యంగా మానవాళికి కలుగుతున్న నష్టం వర్ణణాతీతం.ఈనేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టడం జరిగింది. దానిలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన రాష్ట్ర సచివాలయం నుండే ముందుగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ద్వారా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేందుకు శ్రీకారం చుట్టనున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వివిధ శాఖల కార్యదర్శులతో సమావేశమై చర్చిస్తున్నారు.ఆగష్టు 15 నుండి ఎపి సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కార్యదర్శులతో సమీక్షిస్తున్నారు.ముఖ్యంగా పర్యావరణానికి హాని కలిగిస్తున్న ఒకసారి వాడి పడేసే వివిధ క్యారీ బ్యాగులు,ప్లాస్టిక్ మంచినీటి సీసాలు,గ్లాసులు, ప్లేట్లు,కప్పులు, స్పూన్లు, ఫోర్కులు,ఫినాయిల్ సీసాలు, డబ్బాలు తదితర వస్తువులను పూర్తిగా నిషేధించే ఇందుకు తీసుకోవాల్సిన అంశాలపై సిఎస్ విజయానంద్ చర్చిస్తున్నారు. ఈసమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ రావత్,ఎంఎయుడి ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, పిసిబి చైర్మన్ కష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్ కుమార్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఆర్పి సిసోడియా,కష్ణబాబు,సిసిఎల్ఏ జయలక్ష్మి,జిఏడి ముఖ్య కార్యదర్శి ఎంకె మీనా, సిఆర్డిఏ కమీషనర్ కె.కన్నబాబు,ముఖ్య కార్యదర్శి సునీత,కార్యదర్శులు తదితరులు వర్చువల్ గా పాల్గొన్నారు.

# ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలి

-మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని... ఎక్కడా ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం అమలుకు సంబంధించి ప్రయాణికుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకుని, దానికి అనుగుణంగా పథకాన్ని మరింత మెరుగ్గా అమలు పరచాలని సీఎం నిర్దేశించారు. సర్వీస్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా సేవలు అందించేలా చూడాలన్నారు. 'ఈపోస్ మిషన్లకు జీపీఎస్ తప్పనిసరిగా ఎనేబుల్ చేసి ట్రాక్ చేయడం ద్వారా ప్రయాణికులకు సమాచారాన్ని అందించాలి. ఆర్టీజీఎస్‌తో అనుసంధానమై పనిచేయాలి. సమస్యలు ఎక్కడైనా ఉత్పన్నమైతే వాటిని వెంటనే పరిష్కరించేలా వ్యవస్థ సిద్ధంగా ఉండాలి. బస్ స్టేషన్లు అత్యంత పరిశుభ్రంగా ఉండాలి. ఎప్పటికప్పుడు చెత్త తొలిగించాలి. టాయిలెట్లను ప్రతి 2 గంటలకు ఒకసారి శుభ్రపరచాలి. దీనిపై ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలి. ప్రయాణికులు ఎక్కడా అసౌకర్యానికి గురి కాకూడదు. అన్ని బస్ స్టేషన్లలో తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. రూ.30 కోట్లతో చేపట్టిన బస్ స్టేషన్ల మరమ్మతులు, పెయింటింగ్ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి కావాలి. అవసరమైన చోట్ల కొత్తగా ఫ్యాన్లు, చైర్లు ఏర్పాటు చేయాలి. ప్యాసింజర్లకు సహకరించేలా 24 గంటలు ఆర్టీసీ సిబ్బంది బస్ స్టేషన్‌లో అందుబాటులో ఉండాలి. రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు అదనంగా నడపాల్సి వస్తుండటంతో బస్సులు ఎక్కడా బ్రేక్ డౌన్ కాకుండా చర్యలు తీసుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డనరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహిళలు రాష్ట్రమంతా ప్రయాణించవచ్చని వివరించారు. వీరికి జీరో ఫేర్ టిక్కెట్ కోసం ఈపోస్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ ఆగస్ట్ 14కల్లా అప్డేట్ చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయ్యిందని వెల్లడించారు. స్త్రీశక్తి పథకాన్ని ముఖ్యమంత్రి ఈనెల 15న మధ్యాహ్నం విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో ప్రారంభిస్తారు. మరోవైపు సమీక్షలో ముఖ్యమంత్రి రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు అందించే సాయంపైనా అధికారులతో చర్చించారు. ఆటో డ్రైవర్లకు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలతో కలిపి... కొత్త పథకం రూపొందించేందుకు సమగ్రంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, రవాణా శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే తదితరులు పాల్గొన్నారు.

# కానుకలతో పవన్ కళ్యాణ్

**పిఠాపురం :** రాజకీయాల్లో ట్రెండ్ మారింది. ఇన్నాళ్ల మాదిరిగా ఏడాదికి ఒకసారి నియోజకవర్గానికి వెళ్తామంటే ఓటర్లు నుంచి నిరసనలు తప్పదు. ఫలితంగా అధికార ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవు. దీన్ని గమనించిన ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ పార్టీల నేతలు రూటు మార్చారు. నిత్యం ప్రజలతో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉండాలని పదే పదే అగ్రనేతలు చెబుతున్నారు. ఈ ట్రెండ్‌ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బాగానే ఫాలో అవుతున్నారు. ఒకవేళ బిజీ వల్ల నియోజకవర్గానికి వెళ్లకపోయినా నిత్యం అక్కడి ప్రజలతో టచ్‌లో ఉంటున్నారు. సమయం, సందర్భం బట్టి రకరకాల కానుకలను ప్రజలకు అందజేస్తున్నారు. శనివారం రాఖీ పండగ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గంలో 1500 మంది వితంతు మహిళలకు చీరలు పంపారు. వాటిని నియోజకవర్గంలో నేతలు మహిళలకు అందజేశారు. వాటిని అందుకున్న మహిళలు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. రక్షాబంధన్ రోజు ఊహించని కానుక డిప్యూటీ సీఎం నుంచి రావడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అన్నట్లు మొన్న అల్లూరు జిల్లా టూర్‌కి వెళ్లారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఆ గిరిజన గ్రామానికి తన తోటలో పడిన మామిడిపండ్లను పంపి అక్కడి ప్రజలకు అందజేశారు. దీంతో ఆ గ్రామ ప్రజలు పవన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞత తెలిపారు. ఓ వైపు సినిమాలు, మరోవైపు అధికారులు, ఇంకోవైపు నేతల వరుస సమావేశాలతో నిత్యం బిజీగా ఉంటున్నారు పవన్ కల్యాణ్. దీంతో నియోజకవర్గానికి ఆయన దూరమయ్యారనే వాదన లేకపోలేదు. ఇప్పుడు ఆ గ్యాప్‌ని ఫుల్ చేసుకునే పనిలో పడినట్టు కనిపిస్తోంది. ఈ క్రమంలో రాఖీ పండగ నేపథ్యంలో నియోజకవర్గంలో 1500 మందికి చీరలు పంపారని అంటున్నారు. రేపటి రోజున డిప్యూటీ సీఎం ప్రజలకు ఇవ్వబోయే గిఫ్ట్ ఏంటంటూ చర్చించుకోవడం మొదలైంది. ఒకవిధంగా చెప్పాలంటే ఆ తరహా పద్ధతి ఇప్పటివరకు ఏ రాజకీయ నేతలు పాటించిన సందర్భాలు లేవు. కానీ పవన్ అలా కాదని అంటున్నారు. జరుగుతున్న పరిణామాలు గమనించిన రాజకీయ విశ్లేషకులు పవన్ కొత్త ట్రెండ్ సెట్ చేస్తున్నారని అంటున్నారు. రాబోయే రోజుల్లో పవన్ నుంచి ప్రత్యేక కానుక ఏ ప్రాంతానికి వెళ్తుందో చూడాలి.

# ఘనంగా రేణిగుంట గంగమ్మ జాతర

## అమ్మవారికి సారె సమర్పించిన ఎమ్మెల్సీ సిపాయి



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగష్టు12:**
రేణిగుంట గంగజాతర మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. కోరికలు తీర్చే గంగమ్మ తల్లి ఉత్సవంలో పాల్గొని భక్తులు తరించారు.అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పొంగళ్ళు నైవేద్యంగా పెట్టి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి సారే సమర్పించిన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ముందుగా గంగజాతర వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం గంగమ్మ తల్లికిసంప్రదాయబద్ధంగా అమ్మ వారికి సారె సమర్పించారు. ఆయనకు ఆలయ ధర్మకర్త సోలా మల్లి కార్జున, సదాశివా రెడ్డి కమిటీ మెంబర్లు కేరళ డ్రమ్ములు మంగళ వాయిద్యాలతో బాణ సంచాకాల్చి ఆలయ పెద్దలు ఘన స్వాగ తం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా గంగజాత రకు రావడం చాలా ఆనందకరమని జాతర నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్తకు మరియు కమిటీ మెంబర్లను అభినందించారు. అమ్మవారి గుడి దినదిన అభివృద్ధి చెందుతూ వస్తుందని మరింత అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి అంటూ అమ్మవారి కృపకు రాష్ట్ర ప్రజలందరూ గంగమ్మ తల్లి ఆశీర్వాదం ఉండాలని మనస్ఫూర్తిగా కోరారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక ప్రవచనాలకు శ్రీకారం



**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 12:**
శ్రీకాళహస్తి వాయులింగేశ్వర దివ్య క్షేత్రంలో సుఖబ్రహ్మాశ్రమం ఆధ్వర్యంలో విద్యా స్వరూపానందగిరి ఆధ్వర్యంలో గజేంద్ర మోక్షాన్ని శ్రీకాళహస్తి పట్నం వాసులకు మాన్యశ్రీ ఆముదాల మురళి ప్రవచనాలు వారం రోజులుగా జరపడం మంగళ వారం ముగింపు కార్యక్రమం జరగడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అదేవిధంగా ,ప్రముఖ పారిశ్రామికవేత్త జనార్దన్ పవర్ కూడా రావడం జరిగింది . ఈ సందర్భంగా మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో ట్రస్ట్ బోర్డ్ చైర్మన్గా పనిచేసినప్పుడు శ్రీకాళహస్తిలో ఆధ్యాత్మిక వాతావ రణం కోసం ఆధ్యాత్మిక ప్రవచనాలను జరపాలి అని చెప్పి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్గా సుఖ బ్రహ్మోత్సవం పీఠాధిపతి వారిని కోరుకుంటే వారు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వారినందరిని కూడా ఆహ్వానించి శ్రీకాళహస్తి పట్టణ వాసులకు రామాయణము, మహాభారతము, మహాభాగవతము, శివపురాణము, గజేంద్ర మోక్షాలు, ఇవన్నీ కూడా శ్రీకాళహస్తి దేవస్థానం ఆధ్వర్యంలోనే జరిపించే అవకాశం వెసులుబాటు మేము చేయడం జరిగింది. ఆ విధంగా చేయడం వల్ల శ్రీకాళహస్తిలో నడిబొడ్డులో ముత్యాలమ్మ గుడి వీధిలో ఆ కళ్యాణ మండపంలో ప్రవచనాలు అన్ని కూడా దేవస్థానం నిర్వహించి అందర్నీ కూడా ఆధ్యాత్మిక ప్రవచనాలు వైపు మళ్ళించడం జరిగింది . అయితే దురదృష్టవశాత్తు ఇప్పుడున్న ఈవో బాపిరెడ్డి అక్కడున్న ఏఈవోలు ఎటువంటి సమాచారం సేకరించుకోకుండా ఈ ప్రవచనాలకు మా దగ్గర పర్మిషన్ లేదని చెప్పడం అనేది చాలా దురదృష్టకరమైన పరిస్థితి ఇకనైనా రాబోయే రోజుల్లో సుఖ బ్రహ్మాస్త్రము వారు ఏర్పాటు చేసే ఇటువంటి ఆధ్యాత్మి కార్యక్రమానికైనా శ్రీకాళహస్తి దేవస్థానమే శ్రీకారం చూస్తే ఆధ్యాత్మిక వాతావరణం బాగుంటుంది ప్రవచనాలు వినడం వల్ల భక్తి భావం పెరుగుతుంది భక్తి భావం పెరగడం వల్ల సమాజంలో అనేక రుగ్మతలు చెడు అలవాట్లు కూడా అరికట్టి అవకాశం ఉంటది కాబట్టి ఈ కోణంలో ఆలోచించాల్సిందిగా శాసనసభ్యులు సుధీర్ రెడ్డిని కూడా ఈ సందర్భంగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమాన్ని ఇంత విధంగా నిర్వహించిన రత్నంరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు కార్యక్రమంలో వడ్ల తంగళ్ బాలాజీ రెడ్డి, పేట జనార్ధన్, వెంకటరత్నం, స్థపతి కుమారు, తీగల భాను, ప్రసాద్, సుధీర్,తదితరులు పాల్గొనడం జరిగింది.

## నూలి పురుగులను నివారిద్దాం ఆరోగ్యంగా జీవిద్దాం.. వైద్య అధికారి బాలాజీ చరణ్



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట 12:**
నులిపురుగులను నివారిద్దాం ఆరోగ్యంగా జీవిద్దాం అని డాక్టర్ బాలాజీ చరణ్ అన్నారు. మండలంలోని గంగమ్మ గుడి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా డాక్టర్ బాలాజీ చరణ్ మాట్లాడుతూ విద్యార్థులు గోళ్లను చిన్నవిగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఏదైనా తిన్న తర్వాత మరుగుదొడ్డి వాడిన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళావతి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బయట తిరిగేటప్పుడు బూట్లు గాని, చెప్పులు గాని ధరించాలని బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయకూడదని విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయురాలు పద్మశ్రీ,ఉపాధ్యాయ బృందం, మరియు యమునా, శోభ ,జ్యోతి పాల్గొన్నారు.

## జాతరకు కట్టుదిట్టమైన భద్రత.. సీఐ జయచంద్ర



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగష్టు12:**
రేణిగుంటలో వైభవంగా గంగ జాతర జరుగుతున్న నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించినట్లు రేణిగుంట పట్టణ పోలీసు యంత్రాంగం సీఐ జయచంద్ర తెలిపారు. మంగళవారం, బుధవారం ఈ రెండు రోజులలో గంగ జాతరకు వేలాది మంది భక్తులు తరలివస్తారని భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు భద్రతను, అలాగే డ్రోన్ కెమెరాలు నిరంతరం నిఘా పెట్టినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకునే చర్యలు చేపడతామన్నారు. రైల్వే స్టేషన్ సమీపంలో జాతర నిర్వహిస్తున్న సందర్భంగా ట్రాఫిక్ పర్యవేక్షించడంతోపాటు వాహనాల మళ్లింపు పై దృష్టి పెట్టామన్నారు.ప్రజలు శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులకు సహకరించాలని సీఐ జయచంద్ర విజ్ఞప్తి చేశారు.

### వీకోట మండల అభివృద్ధికై ముఖ్యమంత్రిని కలిసిన

## మండల అధినాయకుడురామన్న చౌదరి..

**వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు12:**



మండలాన్ని అభివృద్ధిపథంలో నడిపించడానికి ముఖ్యమంత్రి వద్దకు. పలమనేరు నియోజకవర్గం వీకోట మండలం. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి వీకోట మండలానికి తెలుగు దేశం పార్టీ, మరియు మండల తెలుగుదేశం పార్టీ కుటుంబం తరపున, మండల ప్రజల కొరకు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోనికి తీసుకెళ్లడానికి మరియు ప్రజలకు పథకాలు సకాలంలో అందడానికి అహర్నిశలు కష్టపడుతున్నటువంటి మన రామచంద్ర నాయుడు (రామన్న చౌదరి ), మండలంలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలను, రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడానికి తానే స్వయంగా బయలుదేరి ముఖ్య మంత్రి కార్యాలయానికి వెళ్లి, మండలంలో నెలకొన్న టువంటి సమస్యలను విన్నవించి మరియు వాటిని పరిష్కరించాలని ముఖ్యమంత్రి కార్యాలయంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వినతిపత్రాలుఅందజేయడ మైనది. వీ. కోట మండలానికి సంబంధించిన వినతి పత్రాలపై స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి. సమస్యలను పరిష్కరించి ప్రజలఅవసరాలను తీరుస్తామనిహామీ ఇచ్చినట్లు రామచంద్రనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్ర నాయుడుతో పాటు కాంట్రాక్టర్ విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

## నులిపురుగుల్ని నులిమేద్దాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట12:**
శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలం వ్యాప్తంగా మంగళవారం నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వైద్యాధికారి లహరి తెలిపారు. అందులో భాగంగా తొట్టంబేడు మండలం సాంబయ్యపాలెం హై స్కూల్, అన్ని అంగన్వాడి పాఠశాలలు, ఎలిమెంటరీ పాఠశాలలు, హైస్కూల్లో ఉన్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ నులుపురుగుల ఆల్బెండజోల్ మాత్రలు మాత్రలు పిల్లలందరికీ మింగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి లహరి మాట్లాడుతూ నులిపురుగులు పిల్లల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయన్నారు. పిల్లల్లో నులిపురుగులు నిర్మూలించి రక్తహీనత నివారణ, శారీరక మానసిక ఎదుగుదలకు, పోషకాహార లోపం, పిల్లల్లో అలసట, బలహీనత వంటి సమస్యలను నిర్మూలించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం డాక్టర్ లహరి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి పూజ, పీహెచ్ఎన్ సంపూర్ణ, హెల్త్ సూపర్వైజర్ ధనమ్మ, లిఖిత్ కుమార్, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడి టీచర్లు, స్కూల్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు12:**
ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసిల్దార్ పార్వతి హెచ్చరించారు. మండలంలోని పెద్ద కొండా మరి రెవిన్యూ గ్రామానికి సంబంధించిన 922/ఏ సర్వేనెంబర్ నందు గల సుమారు రెండు ఎకరాల భూమిలో దురాక్రమణ చేసి చెట్లు నాటుతుండగా వారిని అడ్డుకొని చెట్లను కార్యాలయం వద్దకు తీసుకొచ్చారు. ప్రభుత్వ భూమిలో ఎలాంటి దురాక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన శిక్షలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గొడుగులు వితరణ

**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట12:**



శ్రీకాళహస్తి వాయులింగేశ్వరునిపై తమిళనాడు రాష్ట్రం శ్రీమత్ రామానుజ కైంకర్యం ట్రస్టు తిరువనంతపూర్ భక్తులు భక్తి భావంతో శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు ముక్కంటి ఆలయానికి రెండు గొడుగులు వితరణ చేయడం జరిగింది.రానున్న మహాశివరాత్రికి ముక్కంటి ఆలయ అధికారులు డిజైన్ చేసి ఇస్తే ఆలయానికి మరిన్ని గొడుగులు అందజేస్తామని ఎమ్మెల్యేకి తమిళనాడు భక్తులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గొడుగులు వితరణ చేసిన తమిళనాడు భక్తులకు కృతజ్ఞతలు ఇప్పటికే ముక్కంటి ఆలయ కీర్తిని నలమూలల విస్తరింప చేస్తూ ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి .ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

**చౌడేపల్లి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు12:**



డొక్కాసీతమ్మ మధ్యాహ్నభోజనంలో నాణ్యతలోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో లీలా మాధవి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఉన్నతపాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనంలో కొంతమేర నాణ్యత లోపించిందని పరిస్థితి ఇలాగే కొనసాగితే వేటుతప్పదని హెచ్చరించారు.వండిన విధానంపై అసంతృప్తివ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యుడు నాగరాజు రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల అగచాట్లు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగష్టు 12:**
యూరియా కోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. మండల వ్యాప్తంగా వరి నాట్లను రైతులు వేసే క్రమంలో ఉన్నారు ఇందులో భాగంగా యూరియాకు ప్రాధాన్యత పెరిగింది, దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉన్నప్పటికీ ఒక బస్తా కూడా దక్కలేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు యూరియాను సరఫరా చేయాలని వారు కోరుతున్నారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

# ఓరుగల్లు.. అతలాకుతలం!



ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షంతో ఓరుగల్లు అతలాకుతలమైంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత మొదలైన వానతో వరద ఉప్పొంగి లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకు న్నాయి. రాకపోకలు నిలిచిపోయి.. జనజీవనం స్తంభించింది. ఇళ్లలో నిత్యావసరాలు, సామగ్రి తడిసిపోయాయి. వరంగల్ నగరంలోని కాశికుంట వాంబే కాలనీలో ఇంట్లోకి చొచ్చుకువచ్చిన వరద నీటిలో మునిగి.. పసునూటి బుచ్చమ్మ అనే వృద్ధురాలు మృతి చెందారు. సోమవారం అర్ధరాత్రి మొదలైన కుంభ వృష్టి సుమారు మూడు గంటల పాటు కొనసాగింది. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు చెరువుల్లా మారాయి. వరద అంతకంతకూ పెరిగిపోతుండటంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. అంతా ఇంటి డాబాలపైకి ఎక్కారు. గుడిసెలు, రేకుల ఇళ్లలోని వారు వరద మొదలవగానే ఇళ్లు విడిచి ఎత్తయిన ప్రాంతాలకు వెళ్లిపోయారు. సహాయక చర్యలు చేపట్టిన విపత్తు నిర్వహణ సిబ్బంది వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద బా?ధితుల కోసం ఐదు చోట్ల శిబిరాలు ఏర్పాటు చేశారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లోకి భారీగా వరద చేరి పట్టాలు మునిగిపోయాయి. తర్వాత మెల్లగా వరద తగ్గడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగలేదు. మరోవైపు భారీ వర్షాలతో ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలతోపాటు పలు ప్రాంతాల్లో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో చిలుకల వాగు ఉధృతితో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సంగారెడ్డి జిల్లాలో వందల ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సింగరేణి ఓపెన్ కాస్టుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇక హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాలు నిండిపోవడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దీనితో హైదరాబాద్ నగరం పరిధిలో మూసీ నదిలో వరద పెరిగింది. ముందుజాగ్రత్తగా ముసారాంబాగ్ బ్రిడ్జిని తాత్కాలికంగా మూసివేశారు. కాగా, వరంగల్ జిల్లాలో భారీ వర్షాలకు ఆకేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఇక్కడి పర్వతగిరి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పశువుల కాపరి కందికట్ల ఉప్పలయ్య (65) ఆకేరు వరదలో గల్లంతయ్యారు. సంగారెడ్డి జిల్లా యూసుఫపూర్ శివారులోని బ్రిడ్జిని దాటుతుండగా శ్రీనివాస్ అనే వ్యక్తి నీటి ఉధృతిలో కొట్టుకుపోయారు. మరోవైపు జనగామ జిల్లా రఘునాథపల్లి రైల్వే ట్రాక్ సమీపంలోని పెద్దవాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. ఆ మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు.. అతడికి సుమారు 40-45 ఏళ్ల వయసు ఉంటుందని తెలిపారు.

**5 జిల్లాల్లో స్కూళ్లకు సెలవు**

భారీ వర్షాల నేపథ్యంలో.. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, భువనగిరి జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు విద్యాశాఖ బుధ, గురువారాలు సెలవు ప్రకటించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉదయం పూట మాత్రమే పాఠశాలలు నిర్వహించాలని సూచించింది.

**మంచంపై నిద్రపోయి.. అలాగే నీట మునిగి..**

భారీ వర్షంతో వరంగల్‌లోని కాశికుంట వాంబే కాలనీలో ఒక్కసారిగా వరద పోటెత్తింది. ఆ వరద ఇంట్లోకి చొచ్చుకురావడంతో మంచంపై నిద్రిస్తున్న మానసిక వికలాంగురాలు పసునూటి బుచ్చమ్మ (80) అలాగే నీట మునిగి మృతిచెందారు. ఆమె కుమారుడు గతంలోనే మరణించడంతో.. కోడలు కళావతి, మనవరాలు కృపతో కలిసి ఉంటున్నారు. ఆమె మృతితో వారు విషాదంలో మునిగిపోయారు.

**నేడు, రేపు అతిభారీ వర్షాలు**

బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో బుధ, గురు వారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లోని కొన్ని మండలాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ఖమ్మం జిల్లాలోని మధిర, ఎర్రుపాలెం మండలాల్లో అతిభారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో మోస్తరు వానలు పడతాయని తెలిపింది గురువారం ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో కొన్ని మండలాల్లో 20 సెంటీమీటర్లకుపైగా, మిగతా చోట్ల 11-20 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనూ భారీ వర్షం పడుతుందని పేర్కొంది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం.. వరంగల్ జిల్లా సంగెంలో అత్యధికంగా 20 సెంటీమీటర్ల వాన పడిందని, సూర్యాపేట జిల్లా నాగారంలో 18.7, తిరుమలగిరిలో 18, వరంగల్ జిల్లా ఖిలావరంగల్‌లో 15.7, సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో 13.2, వర్ధన్నపేటలో 12.8, జనగామ జిల్లా కొడకండ్లలో 12.3, సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంలో 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143